నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
ఆదివారం | సెప్టెంబర్ 15, 2024 | www.navatelangana.com

వినాయక మండపాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో ప్రతిష్టించిన కర్ర వినాయక మండపంతో పాటు బంగల్‌పేట్, బుధవార్‌పేట్, మంజులాపూర్, ఆదర్శనగర్, సోఫి నగర్‌లో వినాయక మండపాలను బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయక మండప నిర్వాహకులు మహేశ్వర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ నాయకులు, కౌన్సిలర్‌లు, వినాయక మండపాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-తాండూర్




మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సూరం రవీందర్ అన్నారు. శనివారం మండలంలోని మాదారం పంచాయతీలో పంచాయతీ సెక్రెటరీ సౌందర్యతో కలిసి మహాలక్ష్మి పథక హామీ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారంగా ప్రభుత్వం అభయహస్తం కార్యక్రమం ద్వారా కేవలం రూ.500కే ఎల్పీజీ సిలిండర్ అందిస్తుందని తెలిపారు. నిరుపేదల ఆరోగ్యపరిరక్షణ కోసం కాలుష్య రహిత వంట చేసుకునేందుకు ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం మహిళలకు రెండు చీరలు చొప్పున పంపిణీ చేయనుందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పుట్ట శ్రీనివాస్, ఏఐటీసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ మొగిలి, గోదాల లక్ష్మి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తోటపల్లి ఎల్లయ్య పాల్గొన్నారు.

భద్రత బలోపేతం..!

- రిమ్స్‌లో అడుగడుగునా సీసీ కెమెరాలు
- విద్యార్థులు, వైద్యుల రక్షణకు ప్రత్యేక చర్యలు
- నిరంతరం నిఘా..అధికారుల పర్యవేక్షణ
- కోల్‌కతా ఘటనతో అప్రమత్తమైన యంత్రాంగం

రిమ్స్ ఆస్పత్రితో పాటు వైద్య కళాశాలలో భద్రతను మరింత బలోపేతం చేశారు. కోల్‌కతా ఆర్జీ వైద్య కళాశాలలో చోటుచేసుకున్న హత్యాచార ఘటనతో దేశమంతా ఉలిక్కిపడింది. కళాశాలల్లో వైద్య విద్యార్థుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తాయి. ఈ క్రమంలో జిల్లా అధికార యంత్రాంగం సైతం అప్రమత్తమైంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రితో పాటు వైద్య కళాశాలలలో నిఘాను పటిష్టం చేశారు. గతంలో ఉన్న సీసీ కెమెరాలకు తోడు మరిన్ని అదనంగా జోడించి.. నిరంతరం నిఘా ఉండేలా చర్యలు చేపట్టారు. ఇటీవల జిల్లా పోలీసు ఉన్నతాధికారి రిమ్స్‌లో సుమారు గంటపాటు ఉండి భద్రతకు సంబంధించి అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్య విద్యార్థులు, వైద్యుల భద్రత కోసం పలు కమిటీలు ఏర్పాటుచేశారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా అధికారులు, సిబ్బందిని నియమించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కోల్‌కతాలో జరిగిన పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన లైంగికదాడి, హత్య ఘటన సర్వత్రా ఆందోళన రేకెత్తించింది. వైద్య కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినుల భద్రతపై అనుమానాలు రేకెత్తించాయి. ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. తాజాగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లోనూ భద్రతను పటిష్టం చేయాలని అధికార యంత్రాంగం భావించింది. ప్రభుత్వం, ఉన్నతాధికారుల సూచనతో అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఆస్పత్రి, వైద్య కళాశాల, వసతిగృహాలు(హాస్టల్), సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తదితర విభాగాల్లో మొత్తం 147 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. వీటితో పాటు సెక్యూరిటీ కమిటీని ఏర్పాటుచేయడం, అంతర్గత ఫిర్యాదుల కమిటీ(ఐటీసీ) ఏర్పాటు చేయడంతో పాటు కళాశాల, వసతిగృహాల చుట్టూ ఎవరూ లోనికి వెళ్లకుండా ఫెన్సింగ్ వేయడం, ఫోకస్, ఫ్లడ్ లైట్లు ఏర్పాటుచేశారు. పోలీసులతో సెక్యూరిటీ గార్డులకు అవసరమైన శిక్షణ ఇప్పించారు. వసతిగృహం వైపు సెక్యూరిటీని మరింత పెంచారు. వీటితో పాటు కళాశాలలో ప్రత్యేకంగా రిజిస్టర్‌ను ఏర్పాటుచేశారు. ఎవరు లోనికి వెళ్లాలన్నా..బయటకు వెళ్లాలన్నా వారి వివరాలు అందులో నమోదు చేయాల్సి ఉంటుంది. మందుల నిల్వ కేంద్రం వద్ద బారికేడ్లు సైతం ఏర్పాటుచేశారు.



నిరంతరం పర్యవేక్షణ..!

రిమ్స్‌లో ఇది వరకు పలు ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆస్పత్రి ముందు నిలిపి ఉంచిన వాహనాలు చోరీకి గురికావడం, సెల్‌ఫోన్లు తరుచూ దొంగతనాలకు గురైన సందర్భాలతో పాటు పలు ఆందోళనలు, ఘర్షణలు జరిగిన సందర్భాలున్నాయి. తాజాగా భద్రతను మరింత పటిష్టం చేయడంతో అలాంటి వాటికి తావులేకుండా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం వైద్య కళాశాలలో 600మంది ఎంబీబీఎస్ విద్యార్థులు చదువుతుండగా.. మరో 200మంది పీజీ విద్యార్థులున్నారు. వీరితో పాటు బీఎస్సీ నర్సింగ్ 220మంది, బీఎస్సీ అలైడ్ సైన్స్ మరో 220మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం వీరితో పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులకు సైతం భద్రత కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. తాజాగా ఏర్పాటుచేసిన 147 సీసీ కెమెరాలను నిరంతరం పర్యవేక్షించేందుకు ఆయా విభాగాల్లో అధికారులు, సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. క్యాజువాలిటీతో పాటు ఎస్ఎంసీవిభాగం, సూపర్ స్పెషాలిటీలో అధికారులు, సూపర్‌వైజర్లు నిరంతరం నిఘా ఉంచనున్నారు.

భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం : డా. జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్



రిమ్స్‌లో ఇది వరకే భద్రత పరంగా అన్ని చర్యలు చేపట్టాం. కోల్‌కతా ఘటన జరిగిన తర్వాత మరింత అప్రమత్తమయ్యాం. ఆస్పత్రి, కళాశాల, వసతిగృహాలు, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి తదితర వాటిలో 147 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశాం. విద్యార్థులు, వైద్యుల భద్రత కోసం సెక్యూరిటీ పెంచడంతో పాటు వివిధ రకాల చర్యలు చేపట్టాం. ఆస్పత్రి, కళాశాలల్లో భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తూ వారి రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ఎస్‌బీఐలో చొరబడ్డ దొంగలు



నవతెలంగాణ-ముధోల్

నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లోని ఎస్బీఐలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చొరబడి దొంగతనానికి యత్నించారు. ఎస్ఐ సాయికిరణ్ కథనం ప్రకారం...దొంగలు బ్యాంక్ వెనక భాగాన ఉన్న వెంటిలేటర్‌కు ఉన్న ఇనుప చువ్వలు తొలగించి చొరబడ్డారు. ముందుగా బ్యాంకులోని సిసి కెమెరాలు, అలారం వైరులను తొలగించారు. బ్యాంక్ అంతా కలియదిరిగి వెళ్లిపోయారు. శనివారం ఉదయం బ్యాంక్ సిబ్బంది బ్యాంకు తెరిచేసరికి ఈవిషయం బయటపడింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని సిఐ మల్లేష్, ఎస్ఐ పరిశీలించారు. ఈ సందర్భంగా డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్, సిబ్బంది ఆధారాలను సేకరించారు. బ్యాంకులో దుండగులు వెనక భాగం నుండి చొరబడ్డారని, ఎలాంటి నగదు అపహరణకు గురికాలేదని ఎస్ఐ తెలిపారు. బ్యాంక్ మేనేజర్ ఎస్వి.గిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు డీఎన్ఏ పరీక్షలు తప్పనిసరి



నవతెలంగాణ-మంచిర్యాల

తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధి గ్రస్తులు, కుటుంబ సభ్యులు డీఎన్ఏ, హెచ్‌బిఏ-2 రక్త పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మెన్ కంకణాల భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో 35 మంది తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. రాబోయే రోజుల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సదరం సర్టిఫికెట్లు పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ముధోల్‌లో ప్రశాంతంగా వినాయక నిమజ్జనం

నవతెలంగాణ-ముధోల్

నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లో శుక్రవారం ప్రారంభమైన గణేష్ నిమజ్జనం వేడుకలు శనివారం తెల్లవారు జామున ముగిశాయి. గణేష్ నిమజ్జనం వేడుకలు ప్రశాంతంగా ముగియటంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ముధోల్‌పై ఎస్పీ జానకీ షర్మిల, అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోని బందోబస్తు చర్యలు పర్యవేక్షించారు. గణేష్ నిమజ్జనం బందోబస్తును శుక్రవారం రాత్రి వరకు ఎస్పీ జానకీ షర్మిల పర్యవేక్షించారు. నిమజ్జనం ఏర్పాట్ల రూట్ మ్యాప్‌ను ఒక రోజు ముందుగా పరిశీలించారు. శుక్రవారం ఉదయం ఎస్పీ ముధోల్‌కు చేరుకొని నిమజ్జనం బందోబస్తును ముందుగా పర్యవేక్షించారు. పలు సూచనలు, సలహాలను స్థానిక సిఐ మల్లేష్, ఎస్ఐ సాయికిరణ్‌కు తెలియజేశారు. రెండు రోజుల ముందు తరోడ గ్రామంలో గణేష్ నిమజ్జనం బందోబస్తును ఎస్పీ పరిశీలించారు. అలాగే గణేష్ మండలి నిర్వాహకులు, ఉత్సవ సమితి సభ్యులు పోలీసులకు సహకరించారు. దీంతో ముధోల్ మండలంలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, ఎస్సై సాయికిరణ్ నిమజ్జనం బందోబస్తును మోటార్ సైకిల్‌పై గల్లీగల్లీకి వెళ్లి పర్యవేక్షించారు. మొత్తానికి గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరగటంతో పోలీసులను పలువురు అభినందించారు.

నిరంతరాయంగా బొగ్గు సరఫరా కొనసాగిద్దాం

- రోజు 2లక్షలకు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి, రవాణా జరపాలి
- సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ నాయక్

నవతెలంగాణ-జైపూర్

రాష్ట్రంలో గల థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఎటువంటి బొగ్గు కొరత లేకుండా సరఫరా కొనసాగించాలని, ఈ క్రమంలో ప్రతి రోజు కనీసం 2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, అదే పరిమాణంలో బొగ్గు రవాణా కొనసాగాలని సింగరేణి సీఎండీ బలరామ్ సింగరేణి వ్యాప్త జనరల్ మేనేజర్లను ఆదేశించారు. ఈ మేరకు శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సింగరేణి వ్యాప్త జనరల్ మేనేజర్లతో ఏరియాల వారీగా ఉత్పత్తి సాధిస్తున్న తీరును సమీక్షించారు. భారీ వర్షాలతో ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఇంకా నిలువైన నీటిని తక్షణమే తొలగించాలని, అవసరమైన అదనపు పంపులు వినియోగించాలని తద్వారా బొగ్గు ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రోజుకు కనీసం 14లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని సూచించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడంలో సింగరేణి సంస్థ తన వంతుగా తగినంత బొగ్గును అందించాల్సిన బాధ్యత కలిగి ఉందని గుర్తు చేశారు. ఈ విషయంలో అధికారులు తగు విధంగా అంకిత భావంతో పని చేయాలని, రక్షణతో కూడిన ఉత్పత్తులు సాధించాలని పేర్కొన్నారు. వర్షాల వల్ల గత మూడు నెలల్లో కోల్పోయిన ఉత్పత్తి నష్టాలను భర్తీ చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా కొత్తగూడెం వీకేఓసీ తొలి దశ అటవీ అనుమతులు లభించినందున రానున్న రెండు నెలల్లో ఉత్పత్తి ప్రారంభానికి కావల్సిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ విషయమై సింగరేణి వ్యాప్త జనరల్ మేనేజర్లు సూచించిన పలు అంశాలపై అప్పటికప్పుడు డైరెక్టర్లతో చర్చించి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో డైరెక్టర్ సత్యనారాయణరావు, వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ ఎస్‌డీఎం సుభాని, జీఎం జక్కం రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



ఆదిలాబాద్‌టౌన్



నార్నూర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి గుడిహత్నూర్ జూనియర్ కళాశాల హిందీ అధ్యాపకులు శ్రావన్ రాథోడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ జాదవ్ గణేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల హిందీ అధ్యాపకులు సూరజ్ సింగ్ భాషా పండితులు ఉమాదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందీ భాష రాణి వంటిదని, భవిష్యత్తులో మహారాణిగా అవతరిస్తుందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని డా.బీఆర్ అంబేద్కర్ హిందీ భాషలోనే లిఖించడం జరిగిందని, ఆ తర్వాత ఇంగ్లీషు భాషలోకి మార్చారని తెలిపారు. హిందీ భాష సరళమైన మధురమైన భాష అని కొనియాడారు. అనంతరం ప్రిన్సిపాల్ అధ్యాపకులు విద్యార్థులు ముఖ్య అతిథికి, భాషా పండితులకు శాలువతో సత్కరించారు. అనంతరం పరీక్షల్లో 90శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు.

నార్నూర్ : హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు ఆయా గ్రామాల్లోని హిందీ ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. దేశంలో రెండో రాజ భాష హిందీ నేర్చుకోవడం, చదవడం రాయడం చాలా అవసరమని విద్యార్థులకు సూచించారు. హిందీ భాషపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. హిందీ భాష ప్రాముఖ్యత గుర్తించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, హిందీ ఉపాధ్యాయుడు రాథోడ్ సుదర్శన్, పీడీ ఆడే విశ్వనాథ్, పిఎస్ హెచ్ఎం శంకర్, ఉపాధ్యాయులు నీలయ్య, సూరత్‌సింగ్, వసంతరావ్, ప్రకాష్, రాజ్యలక్ష్మి, విజయ, రాజశేఖర్ పాల్గొన్నారు.

తాంసి : హిందీ భాష దినోత్సవం పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో హిందీ భాష బోధన ఉపాధ్యాయుడు సంతోష్‌ను పాఠశాల సిబ్బందితో పాటు విద్యార్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు నాటికలు, పాటలు, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హిందీ భాష ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, ఉపాధ్యాయులు రంజన, జక్కుల శ్రీనివాస్, ఉమా మహేష్, అనిల్, సతీష్, రాజా గీతేష్ , కరుణ పాల్గొన్నారు.

అక్టోబర్ 2 నుండి 31 వరకు 4.0 ప్రత్యేక కార్యక్రమాలు

- సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం, ఆపరేషన్స్) సత్యనారాయణరావు



నవతెలంగాణ-జైపూర్

భారత ప్రభుత్వం, మినిస్ట్రీ ఆఫ్ కోల్‌మైన్స్ ఆదేశాల మేరకు అక్టోబర్ 2 నుండి 31 వరకు సింగరేణి వ్యాప్తంగా 4.0 ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం, ఆపరేషన్స్) సత్యనారాయణరావు వెల్లడించారు. ఈ క్రమంలో ముందస్తు ప్రణాళికలో భాగంగా ఈ నెల 19 నుండి 30 వరకు పరిశుభ్ర పర్చాల్సిన పరిసరాల ఎంపిక విషయమై శనివారం సింగరేణి డైరెక్టర్ (పీఅండ్‌పీ, పా) వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి అన్ని విభాగాలు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో సింగరేణి భవన్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 నుండి 31 వరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ క్రమంలో కార్యాలయాలు, గనులు, పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు సుందరీకరించుకోవాలని తెలిపారు. అదేవిధంగా గనులలో ఉండే స్క్రాప్ తీసివేయడంతో పాటు ఆఫీసుల్లో ఉండే పెండింగ్ ఫైల్స్ త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. రికార్డ్స్ రూమ్‌లను శుభ్రపర్చుకోవడం, రికార్డులను క్రమ సంఖ్యలో పొందుపర్చుకోవడం, అదేవిధంగా ఈ ప్రత్యేక కార్యక్రమం 4.0లో చేసిన కార్యక్రమాల నివేదికలు రోజు వారిగా సింగరేణి ప్రధాన కార్యాలయానికి పంపించాలని తెలిపారు. ఈ స్వచ్ఛత కార్యక్రమాన్ని అన్ని ఏరియాలలో సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అన్ని విభాగాలు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా జీఎం(ఐఅండ్‌పీఎం) నోడల్ ఆఫీసర్ రవి కుమార్ ఈ స్పెషల్ క్యాంపెయిన్ 4.0లో చేయాల్సిన కార్యక్రమాల విధి విధానాలను డైరెక్టర్లకు, ఏరియా జనరల్ మేనేజర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

నేడు మెగా హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రజాబంధు, దివంగత ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు 25వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం పటేల్ గార్డెన్‌లో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుండి నిర్వహించే ఈ హెల్త్ క్యాంప్‌లో 20 మంది నిష్ణాతులైన వైద్య బృందంతో సాధారణ వైద్యంతో పాటు స్త్రీల సంబంధిత, చెవి, ముక్కు, గొంతు, కంటి, దంత, ఎముకలు, కీళ్ల, పిల్లలు, గుండె, కిడ్నీ, మూత్రాశయ, నరాలు, ఉదరకోశ వైద్యసేవలకు పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంప్‌లో అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, ఎక్స్‌రే, రక్త, మూత్ర పరీక్షలను ఉచితంగా నిర్వహించి, మందులు ఉచితంగా అందించనున్నట్లు ఆయన వివరించారు. సిర్పూరు నియోజకవర్గ ప్రజలు ఈ ఉచిత మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

రోజురోజుకూ ఉధృతమవుతున్న ఉద్యమం

నవతెలంగాణ-నిర్మల్

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 54వ రోజుకు చేరుకున్నాయి. గుండంపల్లిలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 10వ రోజుకు చేరుకున్నాయి. దిలావర్‌పూర్ గ్రామంలోని మహిళలు, బాలికలు శనివారం రోజున పెద్ద సంఖ్యలో రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. మహిళలు ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా చేసిన నినాదాలు దీక్ష స్థలంలో హోరెత్తాయి. ఈ సందర్భంగా ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేక పోరాటానికి రోజు రోజుకు మహిళల మద్దతు పెరుగుతోందని తెలిపారు. ఫ్యాక్టరీని తరలించే వరకు పోరాటాన్ని ఇంకా ఉధృతం చేస్తామని తెలిపారు. ఇకపై మండలంలోని ప్రతి గ్రామంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టేలా చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఇకనైనా నాయకులు, అధికారులు పర్యావరణన్ని పాడుచేసే ఫ్యాక్టరీని తరలించాలని కోరారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జాతీయ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం, హిందీ విభాగాధిపతి డి జనార్ధన్‌లు విద్యార్థులకు హిందీ ప్రాముఖ్యత గురించి వివరించారు. చిత్రలేఖన పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీగా రామానుజం బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ నూతన డీఎస్పీగా బి రామానుజం శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో విధులు నిర్వర్తించిన రామానుజం బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన కరుణాకర్ ఆసిఫాబాద్‌కు బదిలీ అయిన విషయం తెల్సిందే. కరుణాకర్ నుండి బాధ్యతలు స్వీకరించిన రామానుజంను కాగజ్‌నగర్ టౌన్ సీఐ శంకరయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

17న గణేష్ నిమజ్జనం

నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలో ఈ నెల 17న జరిగే వినాయక నిమజ్జన ఏర్పాట్లను శనివారం మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, పట్టణ సీఐ బన్సీలాల్‌తో కలిసి పర్యవేక్షించారు. ఊరేగింపు కొనసాగే రహదారులు, గోదావరి ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యుత్ లైట్లు, రక్షణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. హిందూ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన మంజుల గట్టయ్య కుమారుడు మంజుల వెంకటస్వామి శనివారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న వడ్డెర బస్తీకి చేరుకొని, మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ఇచ్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సలీం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్ ఉన్నారు.



ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోసం వేసిన కమిటీని రద్దు చేయాలని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండలాధ్యక్షులు సోన్‌కాంబ్లే మనోహర్ అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణతో అనేక మంది పేద దళితులకు అన్యాయం జరుగుతుందన్నారు. దీనితో కొన్ని వర్గాలకే లాభం చేకూరుతుందన్నారు. 75శాతం దళిత కుటుంబాలు రిజర్వేషన్‌కు దూరంగా ఉంటారని గుర్తు చేశారు. వర్గీకరణకు నిరసనగా ఈ నెల 30న చలో హైదరాబాద్ నిరసనను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కామరాజ్, రాజ్యవర్ధన్, శివాజీ, పరత్‌వాగ్ దత్త పాల్గొన్నారు.



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రతను పాటించాలని హెచ్ఈఓ తులసీదాస్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ సూచించారు. శనివారం మండలంలోని గుండాల గ్రామపంచాయతీ పరిధిలోని గుండాల తండా, గుండాల గోండుగూడ, చిత్రుగూడలో వైద్యసిబ్బందితో కలిసి వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. డ్రమ్ముల్లో, టైర్లలో, కూలర్‌లో ఉన్న నీటిని పారబోయించారు. చెత్త చెదారం బయట పారేయకుండా చెత్త వాహనంలో వేయాలన్నారు. ఈ వైద్య శిబిరంలో సిబ్బంది హిమబిందు, గోకుల్, ఈశ్వర్, జవహర్, మాన్కుబాయి, ఈశ్వరి, కార్యదర్శి కాశీరాం, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, సీత, ఆశా కార్యకర్తలు రుక్మాబాయి, జ్యోతి ఉన్నారు.

నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వినాయక నిమజ్జనోత్సవానికి మున్సిపల్ తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పీస్ కమిటీల సమావేశంలో వచ్చిన ఫిర్యాదులు, గత అనుభావలతో పాటు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడుస్తు, మార్గాలను సరి చేస్తున్నారు. ఇప్పటికే వినాయక శోభయాత్రలో చెట్ల కొమ్మలు అడ్డు వస్తుయని తెలుసుకున్న అధికారులు వాటిని కూడా తొలగిస్తున్నారు. నిమజ్జనోత్సవంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి ఏర్పాట్లు చేస్తున్నారు. దీన్ని కలెక్టర్, ఎస్పీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు సూచనలు అందిస్తున్నారు.

ఇబ్బందులు కలుగకుండా చర్యలు...

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో 9, 11వ రోజు అధికంగా వినాయక నిమజ్జనోత్సవాలు జరుగుతాయని, దానికి అనుగుణంగా ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. వినాయక శోభ యాత్ర రూట్ మ్యాప్ ఆధారంగా రోడ్లపై ఏర్పడిన గుంతలతో పాటు అంతర్గతంగా ఉన్న గుంతలను పూడుస్తున్నామన్నారు. బీటీ రోడ్లపై మరమ్మతులు చేస్తున్నట్టు వివరించారు. గ్రావెల్ వేయడం లేదని వస్తున్న విమర్శల నేపథ్యంలో గ్రావెల్ వేసే సమయంలో జియోట్యాక్ ద్వారా ఫోటోలను సేకరిస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా పెన్‌గంగా, చాందా(టి) చెరువుల వద్ద అన్ని చర్యలు తీసుకుంటున్నామని, పెన్‌గంగా వద్ద క్రేన్లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎలాంటి ఇబ్బందులు, పొరపట్లకు తావు లేకుండా చూస్తున్నామని పేర్కొన్నారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- బీసీ సంక్షేమశాఖ అధికారి రాజలింగు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుల వృత్తులను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని అమలు చేస్తుందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు కోరారు. శనివారం పట్టణంలోని రాంనగర్‌లో రజకులకు పీఎం విశ్వకర్మ పథకం ఆధునిక శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఏడు రోజుల పాటు నిర్వహించే శిక్షణలో తొలి రోజు రజకులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు మాట్లాడుతూ కులవృత్తుల వారికి ఆర్థికంగా ఆదుకునేలా పీఎం విశ్వకర్మ యోజన ఉందని తెలిపారు. ఎలాంటి పూచికత్తు లేకుండా రుణాలతో పాటు శిక్షణ, వృత్తి సంబంధించిన కిట్‌లను అందిస్తారన్నారు. రేషన్ కార్డులోని కుటుంబంలో ఒక్కరు మాత్రమే అర్హులని సూచించారు. మీసేవ కేంద్రంలో దరఖాస్తులను ఉచితంగా చేస్తారన్నారు. ఎవరైన డబ్బులు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ యోజన జిల్లా మేనేజర్ రాజేందర్ జాదవ్, శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాస్, ట్రైనర్లు కార్తీక్, ప్రవీణ్, సాయి, రజక సంఘం పట్టణాధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నేరడిగొండ

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్‌ను శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలిశారు. ఇటీవల పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి జరుగడంతో ఆయనను కలిసేందుకు కేటీఆర్‌తో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా పాడి కౌశిక్‌రెడ్డి ఆయన నివాసంలో పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్
- కార్మికుల నుంచి సంతకాల సేకరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భవన నిర్మాణ కార్మిక హెల్పర్ బోర్డు ద్వారా అమలు చేస్తున్న స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలనే ప్రతిపాదనను మానుకోవాలని బోర్డు అడ్వైజర్ కమిటీ నియమించి, ప్రభుత్వమే బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు కార్మికులకు అందజేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని నేతాజీచౌక్‌లో భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపులో భాగంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ తెలంగాణ భవన నిర్మాణం, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు అమలు చేస్తున్న స్కీములను సహజ మరణం, ప్రమాదవశాత్తు మరణం, పాక్షిక అంగవైకల్యం, శాశ్వత అంగవైకల్యం, ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడం ద్వారా వెల్ఫేర్ బోర్డు నిధులను నేడు ప్రయివేటుపరం చేయడానికి చేస్తున్న ఆలోచనలను ఉపసంహరించుకోవాలని అన్నారు. వెల్ఫేర్ బోర్డు పటిష్ట పరచాలని డిమాండ్ చేస్తూ, సంతకాల సేకరణ చేపట్టి ముఖ్యమంత్రికి వినతిపత్రం రూపంలో అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్మికుల అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 1979 వలస కార్మిక చట్టాన్ని, 1996 కేంద్ర భవన నిర్మాణ కార్మిక చట్టాన్ని నిర్వీర్యం చేసే దిశగా విధానాలను రూపొందించడం సరి కాదన్నారు. ప్రమాదవశాత్తు సహజంగా మరణించిన భవన నిర్మాణ కార్మిక కుటుంబాలకు రూ.10లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. 65 సంవత్సరాలు నిండిన కార్మికులకు ప్రతి నెల రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. దహన సంస్కారాలు ప్రసూతి కానుక, పెండ్లికానుకను రూ.లక్షకు పెంచాలన్నారు. 2009 సంవత్సరంలో ఇచ్చిన వెల్ఫేర్ బోర్డు కార్డులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన రెన్యువల్ చేయాలని, వెల్ఫేర్ బోర్డు నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లించొద్దన్నారు. బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసి పరిరక్షించాలని అన్నారు. కాగా జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గార్డెన్స్ లో ఈనెల 16న రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు అలాగే 18న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. వెల్ఫేర్ బోర్డు పరిరక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలకు వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటాలలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ, జిల్లా నాయకులు సుభాష్, నర్సింగ్, దేవిదాస్, మారితి, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్, సహాయ కార్యదర్శి ఉమ్రే నితిన్, ఉపాధ్యక్షులు సర్కలే రాజు, సీఐటీయూ నాయకులు అశోక్, విఠల్, భగవాన్ పాల్గొన్నారు.



ఘనంగా హిందీ భాషా దినోత్సవం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వై.రామిరెడ్డి అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ హిందీ ఉపాధ్యాయులు హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పెట్కులేను పాఠశాల తోటి ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. హిందీ భాష గొప్పతనాన్ని విద్యార్థులకు చిత్రలేఖనం ద్వారా వివరించి, హిందీపై ఉన్న పట్టును చాటుకున్నారు. అనంతరం హిందీ సాహిత్యం, స్వాతంత్ర్య ఉద్యమంలో హిందీ పాత్ర తదితర అంశాలతో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాషా వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఈనెల 20న జిల్లాస్థాయిలో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల స్థాయిలో విజేతలైన విద్యార్థులకు, జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనేలా హిందీ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, స్వామి, సుజాత, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నాందేవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బేల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. హిందీ భాషా దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు ఉపన్యాస, వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ భగువాండ్లు మాట్లాడుతూ హిందీ భాష జాతీయ భాష అని, ప్రతి ఒక్కరూ హిందీ భాషను నేర్చుకోవాలని అన్నారు. హిందీ భాషలో ఉన్న విద్యా, సాంస్కృతిక దృక్పతాన్ని అలవర్చుకోవాలని పిలుపు నిచ్చారు. కళాశాల హిందీ అధ్యాపకులు వహీద్ మాట్లాడుతూ హిందీ భాష ప్రాముఖ్యత, హిందీ దివస్ విశేషాలను తెలియజేశారు. హిందీ అధ్యాపకులు వహీద్‌ను కళాశాల బృందం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుల బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మండలానికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం.. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండల పరిధిలోని పిప్పిరి గ్రామపంచాయతీని దత్తత తీసుకోవడాన్ని ఎమ్మార్పీఎస్ సంపూర్ణంగా స్వాగతిస్తున్నామన్నారు. మండల పరిధిలో కనకాయి లిఫ్ట్ ఇరిగేషన్‌కు కేటాయించిన సుమారు రూ.45కోట్ల నిధులను వెంటనే విడుదల చేసి, సర్వే పనులను చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. అంతర్రాష్ట్ర రోడ్ ఇచ్చోడ నుంచి బజర్‌హత్నూర్ రోడ్డు వెడల్పు పనులను ప్రారంభించాలని, దేగమా గ్రామ నిర్వాసితులకు న్యాయం చేయాలని అన్నారు. మండల పరిధిలోని గ్రామాలలో నెలకొన్న అనేక సమస్యలపై తమరు స్పందించి హామీలను త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కుప్టి ప్రాజెక్టును పనులను ప్రారంభించాలని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని నియోజవర్గంతో పాటు మండలాభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు గోటిముక్కలే మధుకర్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు గవాలే అనిల్ కుమార్, అయిండ్ల సాయి, రాజు, రాజేశ్వర్, పోశెట్టి, రావి, మణికంత, రాకేష్, మహేష్, అరుణ్ పాల్గొన్నారు.



వినాయక నిమజ్జనం శాంతియుతంగా జరుపుకోవాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్

వినాయక నిమజ్జన వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులు, విద్యుత్‌శాఖ గ్రామపంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించి పలు విషయాలపై చర్చించారు. ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. వినాయక నిమజ్జన శోభాయాత్రలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా గట్టి బందోబస్తే నిర్వహించాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు కరెంటు విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. ప్రజలకు విద్యుత్ తీగలు తగలకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువుల వద్ద హైమస్ విద్యుత్ దీపాలు అమర్చాలని సూచించారు. గ్రామపంచాయతీ సిబ్బంది సైతం జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్సై మనోహర్, విద్యుత్‌శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



అనాధ పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలి



నవతెలంగాణ-సిరికొండ

తల్లిదండ్రులను రెండు నెలల కాలవ్యవధిలోనే కోల్పోయి అనాధలైన ఇద్దరు పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ కోరారు. మండల కేంద్రంలో ఇటీవల పంచాయతీ కార్మికుడిగా పని చేసిన దాసరి శ్రీనివాస్, అతడి భార్య రజిత రెండు నెలల వ్యవధిలోనే మరణించారు. దీంతో ఇద్దరు పిల్లలు అనాధలుగా మారారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయి ఆ కుటుంబ పరిస్థితి దీనావస్థలో ఉందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టి సారించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు గైక్వాడ్ సురేష్, సీనియర్ నాయకులు దుబ్బాక సుభాష్, గురుమూర్తి, అనిల్, శ్రీనివాస్, పోశన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ని హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 16న ఉట్నూర్ మండల కేంద్రంలో హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ వినాయక నిమజ్జన సామూహిక శోభాయాత్ర కార్యక్రమానికి రావాలని, ఎమ్మెల్యేకు ఆహ్వానం పలికారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. శోభయాత్రకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు అప్ప పెద్ద పోతన్న, తోట భాస్కర్, మన్మథ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఎర్ర భోజన్న తల్లి, హవర్గ గ్రామానికి చెందిన రామకృష్ణ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శనివారం ఆయా గ్రామాలకు చేరుకొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ మండల నాయకులు సాయరెడ్డి, మురళీ, రాజుర మాజీ సర్పంచ్ సుందరగిరి ముత్తగౌడ్, జిల్కరి సాయి ప్రసాద్, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, జుట్టు భూమన్న ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ధనోర(బి)తో పాటు వివిధ పాఠశాలలను సందర్శించారు. సంఘం సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల 317 జీఓతో పాటు పాత పీఆర్సీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బలరాం, రవీందర్, రమేష్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజురలో శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డాక్టర్ ఎం.శ్రావణి యాదవ్ ప్రారంభించి మాట్లడారు. ప్రజలు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలను నిర్వహించుకోవటంతో ఆరోగ్య సమస్యలు ఉంటే పరిష్కరించుకోవచ్చని అన్నారు. కిడ్నీ, గుండె, కంటి సమస్యలను ఎప్పటికీ నిర్లక్ష్యం చేయకూడదన్నారు. రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉంచుకోవడానికి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ శిబిరంలో వంద మందికి పైగా వైద్య పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులను యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ క్రమంలో గ్రామస్తులు మాట్లాడారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు యూత్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ జిల్కరి నిఖిల్, వైస్ ప్రెసిడెంట్ అయిటి పవన్ కళ్యాణ్, యూత్ సభ్యులు రోహిత్, సాయి కుమార్, తరుణ్, ధను, ప్రసాద్, ప్రణయ్ పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితంలో బదిలీలు తప్పనిసరి

నవతెలంగాణ-కెరమెరి



ఉద్యోగ జీవితంలో బదిలీలు తప్పనిసరి అని జోడేఘాట్ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆత్రం మోతీరాం అన్నారు. శనివారం ఆశ్రమ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ప్రఫోల్ కుమార్, ఈశ్వర్, గంగా ప్రసాద్, శాంతి, ఉష ఇంద్రజలకు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు సంపాదించాలన్నారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కుమురం భీం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్, మోహన్, సిబ్బంది శ్రీనివాస్, మాణిక్ రావు, రవీందర్, గణేష్, దీప్తి పాల్గొన్నారు.

సౌకర్యాలతో వసతి గృహాలు ఏర్పాటు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వచ్చే విద్య సంవత్సరంలో ప్రభుత్వ బీఎంసీ నర్సింగ్ విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా కళాశాల, వసతి గృహాల ఏర్పాటుకు చర్యలు తీసుకుటుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ బీఎంసీ నర్సింగ్ కళాశాల, వసతి గృహాల ఏర్పాటుకు ప్రతిపాదిత భవనాలను పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరంలో నర్సింగ్ విద్య అభ్యసించే విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీఎంఐడీసీఈ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కత్తితో అన్నపై దాడిసిన ఇద్దరి రిమాండ్

నవతెలంగాణ-చింతలమానేపల్లి

కత్తితో అన్నపై దాడిసిన ఇద్దరి పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని రవీంద్రనగర్-2 గ్రామంలో బుధవారం రాత్రి కృష్ణ మండల్‌పై అతని తమ్ముడు పవిత్ర మండల్, భార్య ఉమా మండల్ ఇద్దరు కలసి కత్తితో దాడి చేశారు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. బాధితుని భార్య హీర మండల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని భార్యాభర్తలను ఇద్దరినీ అరెస్టు రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన మహేష్ కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని రాజకీయ పరిస్థితులు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. స్థానిక సంస్థల్లో అన్ని చోట్ల గెలిచేలా చూడాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అనిల్ గౌడ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మూడు రోజులుగా తమకు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సామాజిక ఆస్పత్రి కార్మికులు చేస్తున్న నిరసనలో భాగంగా జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. వేతనాలు రాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇదే విషయం సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువెళ్తే దాట వేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆసిఫాబాద్ కార్యదర్శి మల్లేష్, కార్మికులు మురళి, నీల, మమత, హరీష్, గంగన్న, గుణవంతరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా పోచయ్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రయివేట్ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న జిల్లాలోని రెబ్బెన మండల కేంద్రంలో గల విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ పోచయ్య ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా ప్రయివేట్ పాఠశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి ఉత్తమ అవార్డుకు ఎంపిక కాగా ట్రస్మ రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ యాదగిరి, శేఖర్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి అవార్డు అందించారు. ఈ సందర్భంగా పోచయ్య మాట్లాడుతూ తానకు గుర్తింపురావడం సంతోషంగా ఉందని ఇది మరింత బాధ్యత పెంచుతుందన్నారు.

ఈపీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-రెబ్బెన

ఈపీ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం బెల్లంపల్లి ఏరియా ఖైరగూడ ఓపెన్ కాస్ట్‌లో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవి రావు, గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఆర్‌జీ 3 బ్రాంచ్ కార్యదర్శి ఎంఆరెడ్డి రెడ్డి సమక్షంలో ఈపీ ఆపరేటర్లతో వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉద్యోగోన్నతి కల్పించడంలో ఆపరేటర్లకు నిర్లక్ష్యం జరుగుతుందని, డీ గ్రేడ్ నుండి సీ గ్రేడ్‌కు రెండు సంవత్సరాల టైం బాండ్ సీ నుంచి బీకి మూడు సంవత్సరాలు బీ నుండి ఏకు మూడు సంవత్సరాల టైం పాయింట్ పక్కన ఇవ్వాలన్నారు. ఇన్సెంటివ్ విధానంలో మార్పులు చేసి అందరికీ ఇన్సెంటివ్‌లు వచ్చేలాగా చూడాలని, ఎస్-1 విధానాన్ని రద్దు చేయాలని, కంపెనీ లాభాలలో ఉత్పత్తిలో 70 శాతం ఓపెన్ కాస్ట్‌లో ఉన్న ఆపరేటర్ల కృషి వల్లే వస్తుందని, అయిన యాజమాన్యం ఆపరేటర్ల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తుందని ఆరోపించారు. వచ్చే స్ట్రక్చర్ కమిటీలో ఆపరేటర్ల సమస్యల పట్ల యాజమాన్యంతో మాట్లాడి న్యాయం జరిగే విధంగా చూస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, ఆర్‌జీ-3 ఏరియా బ్రాంచ్ సహకారదర్శి, డి.తిరుపతి రావు, ఆర్‌జీ-1 కార్యదర్శి గండి ప్రకాష్, గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జూపాక రాజేష్, కే కిరణ్ బాబు, మీస చంద్రశేఖర్, దేవరకొండ దివాకర్, షిఫ్ట్ ఇన్‌చార్జి పుట్టా అంజన్న పాల్గొన్నారు.

నిందితున్ని కఠినంగా శిక్షించాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- ఎస్పీకి వినతిపత్రం అందజేత



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఆదివాసీ సంఘాల నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జైనూర్ ఘటనలో ఆదివాసుల అక్రమ అరెస్టులు ఆపాలని, నిందితున్ని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్‌ఎస్ నాయకురాలు మర్సుకోల సరస్వతి, ఆదివాసీ సంఘాల నాయకులు, రాయి సెంటర్ నాయకులతో కలిసి ఆదివాసీ సంఘాలు, రాయిసెంటర్ ఆధ్వర్యంలో ఎస్పీ డివి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందనీ ఘటన జరిగి పది రోజులు అయిన ఇప్పటికీ నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, నిందితుడిపై ఏ కేసులు వేశారో కూడా తెలీదని మరణ శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. తమ ఆదివాసీ మహిళకు అన్యాయం జరిగిందన్న ఆక్రోశంతో ఆదివాసులు గొడవకు దిగారని దాంట్లో వేరే ఉద్దేశ్యం లేదని అమాయక ఆదివాసులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. ఇప్పటికే 18 మందిని అరెస్టు చేశారని ఆదివాసుల అరెస్టులు ఆపాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ ఆదివాసుల అస్తిత్వం కాపాడుకునే ప్రయత్నంలో ఘటన జరిగిందనీ దీని కొందరు హిందూ ముస్లీం గొడవగా చిత్రీకరించడం సరికాదన్నారు. ఆదివాసీ మహిళ సమస్యను సామాజిక సమస్యగా గుర్తించడం లేదన్నారు. ఆదివాసుల కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని, ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, నిందితున్ని కఠినంగా శిక్షించాలన్నారు. రాయి సెంటర్ సార్‌మెడి మోతిరాం మాట్లాడుతూ ఆడవిలో ఉండే జంతువులకు ఉండే రక్షణ ప్రస్తుతం రాష్ట్రంలోనీ ఆదివాసీ మహిళలకు లేదని, ఆదివాసీ మహిళకు ఒక న్యాయం వేరే వాళ్లకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. ఏజెన్సీలో ఎలాంటి హక్కు లేని వారిని చేరదిస్తే వాళ్ళు తిరిగి ఆదివాసులపై దాడి చేయడం సమంజసం కాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆదివాసులకు అన్నీ విధాలుగా సహకరించారని సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ ఘటనపై చర్చకు అవకాశం ఇచ్చి ఆదివాసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు బుర్స పోచయ్య, మాడవి గుణవంత్ రావు, శ్రీనివాస్, సిడాం శంకర్ ఉన్నారు.

వెల్ఫేర్ బోర్డు స్కీంలు బీమా కంపెనీలకు ఇవ్వొద్దు

- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమూర్తి
- 23న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమూర్తి

నవతెలంగాణ-కౌటాల

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పథకాలను బీమా కంపెనీలకు ఇవ్వొద్దని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, ప్రభుత్వమే బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న చలో హైదరాబాద్ లేబర్ కమీషనర్ ఆఫీస్ ఎదుట ధర్నాను చేపట్టడం జరిగిందని, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసేలా భవన నిర్మాణ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటి పిలుపునిచ్చిందన్నారు. 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం, 1979 వలస కార్మికుల చట్టాలను, రాష్ట్ర వెల్ఫేర్ బోర్డును రక్షించాలన్నారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన లక్ష మోటార్ సైకిల్‌ను కార్మికులకు అందించడానికి నిబంధనలు రూపొందించాలన్నారు. ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, దహన సంస్కారాల ఖర్చు, ప్రసూతి, వివాహ కానుకలను రూ. లక్షకు పెంచాలని, ఖాళీగా ఉన్న ఏఎస్ఓ, ఏసీఎల్, డీసీఎల్, జూనియర్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. 2009లో నమోదు చేసుకున్న కార్మికుల కార్డులు రెన్యువల్ చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల యూనియన్ మండల నాయకులు పత్తి శంకర్ మాట్లాడుతూ ఈనెల 16న మండల కమిటి సమావేశం అంబేద్కర్ గ్రౌండ్ వద్ద ఉదయం 11 గంటలకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ సమావేశంలో వర్కర్స్ యూనియన్ మండల నాయకులు విఠల్, శేఖర్, లచ్చన్న పాల్గొన్నారు.

సర్వీస్‌లో ఎంతో నేర్పిన బెజ్జూర్‌ను మరువలేను

నవతెలంగాణ-బెజ్జూర్



ఏఓను సన్మానిస్తున్న ఫర్టిలైజర్ అసోసియేషన్ సభ్యులు

తన తొలి పోస్టింగ్ నుంచి 12 ఏండ్ల వరకు బెజ్జూర్‌లోనే సేవలను అందించానని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజుల నాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయనను సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెజ్జూర్‌లో పోస్టింగ్ తీసుకున్నానని ఆ సమయంలో ఎందరో మంది చెప్పారన్నారు. 12 సంవత్సరాల నుండి బెజ్జూర్‌లోనే సర్వీస్ చేశానని, ఈ కాలంలో బెజ్జూర్ ఎంతో నేర్పిందన్నారు. రైతులు, నాయకులు, ప్రజలను ఎన్నటికి మరిచిపోలేనని అలాంటి అనుబంధాన్ని అందించారన్నారు. బదిలీపై వెళ్లడం సర్వస సాధరమని అయిన బదిలీ అయినందుకు బాధపడుతున్నాని అన్నారు. ప్రమోషన్‌తో తిరిగి జిల్లాకు వచ్చి సేవలందిస్తానని తెలిపారు. అనంతరం ఏఈఓ రవితేజ మాట్లాడుతూ బెజ్జూర్ మండల వాసిని అయిన బదిలీపై వెళుతున్నందుకు బాధగా ఉందన్నారు. ఫర్టిలైజర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కడప విశ్వేశ్వర్, పుల్లూరి సతీష్, హకీమ్, జావిద్ అలీ, తంగేడిపల్లి మహేష్, ఫర్టిలైజర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు నేరెళ్ల సందీప్, ఫర్టిలైజర్ యజమానులు శ్రీనివాస్ భూపతి, వసిఖాన్, జాడి దిగంబర్, శ్యాంసుందర్, కార్యదర్శి తుకారం పాల్గొన్నారు.

బదిలీలతో ఖాళీ అయిన ఆదర్శ పాఠశాల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కోర్టు తీర్పు నేపథ్యంలో శనివారం చేసిన బదిలీలు జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ఖాళీ అయింది. పాఠశాలలో పనిచేస్తున్న 12 మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా కేవలం ఇద్దరు మాత్రమే వచ్చారు. దీంతో విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారుకానుంది. అయితే బదిలీల్లో భాగంగా ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ సహా ఉపాధ్యాయులు రాకేష్, శంకర్, ప్రవీణ్, భాగ్యశ్రీ, మంచిర్యాల జిల్లా కాసిపేట్‌కు బదిలీ కాగా ఉపాధ్యాయులు సంపత్, వరలక్ష్మీ, స్వరూప మందమర్రికి, మహేష్ కోటపల్లికి, రమేష్ దండేపల్లికి, రేష్మా పర్వీన్ రామగుండం, శోభ మంచిర్యాలకు బదిలీ అయ్యారు. ఆసిఫాబాద్ పాఠశాలకు దండెపల్లికి చెందిన పీటీజీ మహేశ్వర్, ధర్మారంకి చెందిన టీజీటీ ఫర్వీన్ బదిలీపై వచ్చారు.

వినాయకుని వద్ద అన్నదానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని బాపునగర్ శారద గణేష్ మండలి వద్ద నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజారి రాజు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం కార్యక్రమం చేపట్టారు. అన్నదాన కార్యక్రమానికి దాతగా పోతునూరి శంకర్ గౌడ్ వ్యవహరించగా పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. అన్నదాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీపీ బాలేశ్ గౌడ్, నిర్వహణ కమిటి సభ్యులు గీత, మంగ, వివేక్, విలాస్, సుగుణాకర్, మహేందర్, శ్రీనివాస్, ఆనంద్ పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవానికి డీజేలకు అనుమతి లేదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లాలో గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, నిమజ్జన కార్యక్రమంలో డీజేలకు అనుమతి లేదని ఎస్పీ డీ.వీ.శ్రీనివాసరావ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను సజావుగా జరిగేలా చూడాలని, ఊరేగింపు వాహనాలు విగ్రహాల ఎత్తుకు తగ్గట్టుగా నిర్దేశిత మార్గాలలో వెళ్లాలని సూచించారు. నిమజ్జనం కోసం విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంపై లౌడ్ స్పీకర్ అమర్చకూడదన్నారు. ఊరేగింపులో ఎటువంటి డీజేలకు అనుమతి లేదని ఎవరు వినియోగించకూడదని, నిబంధనలను ఉల్లంఘిస్తే వాటిని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్ నాయక్ తలపెట్టిన చలో జైనూర్‌లో భాగంగా నియోజకవర్గంలోని బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని తిర్యాణి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాధితురాలిని పరామర్శించడానికి వెళ్లే క్రమంలో అరెస్టులు చేయడం దారుణమన్నారు. ఎలాంటి నోటీసులు లేకుండా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. ముందస్తుగా అదుపులోకి తీసుకున్న వారిలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సునీల్ చౌదరి, విశాల్ కాంప్డే, జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇగురపు సంజీవ్, ఆసిఫాబాద్ అసెంబ్లీ కో కన్వీనర్ రమేష్ గౌడ్, బీజేపీ తిర్యాణి మండల అధ్యక్షులు పులి వెంకటేష్, సీనియర్ నాయకులు సప్త శ్రీనివాస్, గేడం సుభాష్, ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు మాటూరి జయరాజ్, బీజేపీ నాయకులు నవీన్ గౌడ్, బక్క ఆనంద్, అత్రం గోపాల్ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో కార్మికుల విధులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో చెల్లించిన విధంగా వేతనాలు కార్మికులకు చెల్లించే వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతామని ఆసిఫాబాద్ మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు పెరిక శ్రీకాంత్ అన్నారు. మున్సిపాలిటీలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు ఏరియాస్ బకాయి వేతనాలు చెల్లించాలని శుక్రవారం చేసిన ధర్నాలో భాగంగా జిల్లా కలెక్టర్ 17లోపు వేతనాలు చెల్లించేలా చూస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వేతనాలు జీఓ నెంబర్ 60 ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సాధారణ నిధి నుండి కార్మికులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి లేనందున కలెక్టర్ ప్రత్యేక నిధి నుండి అందించాలని కోరారు. సమస్య పరిష్కరించేంత వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు సిహెచ్.శంకర్, ప్రభాకర్, శ్రీను, నారాయణ, రాజు, శంకర్, దుర్గప్రసాద్, రాజు, ప్రభాకర్, సాగర్, పురుషోత్తం, ఉప్పర లక్ష్మి, మోతె లక్ష్మి, సంధ్య, కళావతి పాల్గొన్నారు.

గుండెపోటుతో మహిళ మృతి

నవతెలంగాణ-కౌటాల

రెక్కాడితే డొక్కు నింపుకునే పేద కుటుంబంలో మహిళ మృతి విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సదాశివపేటకు చెందిన కర్మె లలిత(40) ఊరురు తిరిగి కూరగాయలు అమ్ముకుని పొట్ట గడుపుకుంది. శనివారం మండల కేంద్రంలో వారసంతలో కూరగాయలు అమ్ముకుంటూ గుండె పోటు రావడంతో అక్కడికక్కడె మృతి చెందిందని భర్త హరిదాసు బోరున విలపించాడు. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు కాగా ఒక కూతురు కుమారుడు ఉన్నారు. కష్టపడి పిల్లలు ఇద్దరినీ హైదరాబాద్‌లో చదివిస్తున్నారు. ఆమె ప్రతి రోజు కూరగాయలు అమ్ముకుంటు అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఉండేదని ఆమె మరణ వార్త విన్న సదాశివపేట గ్రామస్తులు కంటతడి పెట్టారు.

ఎస్పీఎం మైదానంలో ఎగ్జిబిషన్ అనుమతి రద్దు చేయాలి

- వాకర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రాస్తారోకో



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని సిర్పూరు పేపర్ మిల్లు మైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు మిల్లు యాజమాన్యం అనుమతి ఇవ్వడం వివాదానికి దారి తీసింది. దీనిని నిరసిస్తూ వాకర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శనివారం పలువురు ఆందోళనకు దిగారు. చివరికి పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానంలో సుమారు రెండు నెలల ఒప్పందంతో మిల్లు యాజమాన్యం ఎగ్జిబిషన్ ఏర్పాటుకు నిర్వాహకులకు అనుమతి ఇచ్చారు. దీంతో నిర్వాహకులు మైదానంలో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన పనులు ప్రారంభించారు. శనివారం ఉదయం వాకింగ్ కోసం వచ్చిన వాకర్స్ ఈ పనులను చూసి అడ్డుకున్నారు. తమకు మిల్లు యాజమాన్యం అనుమతి ఇచ్చిందని నిర్వాహకులకు చెప్పగా, వాకర్స్ అందరూ యాజమాన్య నిర్ణయానికి వ్యతిరేకంగా లార్ చౌక్ నుండి సర్‌సిల్క్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన రాస్తారోకో తొమ్మిది గంటల వరకు కొనసాగింది. ఎగ్జిబిషన్ ఏర్పాటుతో పట్టణవాసులు మైదానంలో వాకింగ్ చేయలేరని, క్రీడలకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయని మండిపడ్డారు. వచ్చే నెలలో బతుకమ్మ సంబరాలు ఉంటాయని, ప్రతి ఏటా ఈ సంబరాలను ఎస్పీఎం క్రీడా మైదానంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నందున ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తే మైదానంలో బతుకమ్మ పండుగను ఎలా నిర్వహించుకుంటామని ప్రశ్నించారు. ఎస్పీఎం యాజమాన్యం పట్టణవాసులను ఇబ్బందులకు గురి చేయాలనే ఉద్దేశ్యంతోనే ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాకర్స్ అసోషియేషన్ ఆందోళనకు పట్టణవాసులు కూడా మద్దతు తెలుపడంతో ఆందోళన పెరిగింది. దీనితో టౌన్ సీఐ శంకరయ్య వచ్చి సముదాయించే ప్రయత్నం చేశారు. యాజమాన్య ప్రతినిధి రమేష్‌రావు రావడంతో ఆయనపై పలువురు మండిపడ్డారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అనుమతి లేకుండా ఎగ్జిబిషన్ ఎలా ఏర్పాటు చేస్తున్నారని సీఐ శంకరయ్య నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించాలని ఆయన ఎస్పీఎం ప్రతినిధి రమేష్ రావుకు సూచించడంతో వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో వాకర్స్ అసోషియేషన్ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, ఎం సుభాష్, అంబాల ఓదేలు పాల్గొన్నారు.

శాంతియుతంగా నిమజ్జన కార్యక్రమం చేపట్టాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో ఈ నెల 17న నిర్వహించే గణేష్ నిమజ్జన కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరు సహకరించాలని టౌన్ సీఐ టి శంకరయ్య కోరారు. శనివారం రాయల్ గార్డెన్స్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నిమజ్జనం రోజు డీజేలకు అనుమతి లేదని, మధ్యాహ్నం మూడు గంటల వరకు పట్టణంలోని అన్ని వార్డుల నుండి గణేష్ శోభాయాత్రలు ప్రారంభం కావాలని సూచించారు. పెద్దవాగు సమీపంలోని గాంధారి మైసమ్మ ఆలయం వరకు మాత్రమే ప్రయివేట్ వాహనాలకు అనుమతి ఉంటుందని, ట్రాక్టర్లలో పిల్లలను ఎట్టి పరిస్థితులలో కూడా పెద్దవాగు వరకు తీసుకురావద్దన్నారు. ట్రాక్టర్ల డ్రైవర్లు పోలీసుల నిబంధనలు పాటించేలా చూడాలని, డ్రైవర్లతో కమిటీ సభ్యులు దురుసుగా ప్రవర్తించవద్దని తెలిపారు. కార్యక్రమంలో టౌన్, రూరల్ ఎస్ఐలు సుధాకర్, మహేందర్, హిందూ ఉత్సవ సమితి, భజరంగ్‌దళ్ సభ్యులు, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



గ్యాస్ సబ్సిడీ కార్డుల పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్, మల్కెపల్లి, మామిడిగూడెం గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారెంటీలో భాగంగా అభయ హస్తం రూ.500 లకే గ్యాస్ సిలిండర్ సబ్సిడీ మంజూరు కార్డులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ మాట్లాడుతూ గ్యాస్ సబ్సిడీ సంబంధిత కార్డులు రేషన్ డీలర్ల వద్ద ఉన్నాయని, డీలర్లు వాటిని పంపిణీ చేస్తారన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్న కూడా పేదలకు ఇచ్చిన మాట ప్రకారం 6 గ్యారంటీలను అమలు చేసి చూపిస్తామని, ప్రజలు స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

ఆదివారం | సెప్టెంబర్ 15, 2024 | www.navatelangana.com

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఎంజేపీ విద్యార్థులు

నవతెలంగాణ-లక్సెట్టిపేట



మహాత్మా జ్యోతిబాపులే బారుల పాఠశాల, కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన 12 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ నెల 18,19 న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారు జాతీయ స్థాయికి ఎంపిక కావలని ఆకాంక్షించారు.

సీపీఐ(ఎం) పొన్కల్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాజన్న

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొనకల్ సీపీఐ(ఎం) గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గుడ్ల రాజన్నను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి, మండల కార్యదర్శి కనికారం అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాజన్నను గ్రామ కమిటీ కార్యదర్శిగా ప్రకటించారు.

చెరువులు, కుంటలను కాపాడాలి

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం



నవతెలంగాణ-లక్సెట్టిపేట

మండలంలో చెరువులు, కుంటలను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం కోరారు. శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్సెటిపేట మండలంలో చెరువు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయని వెంటనే వాటిని కబ్జాదారుల నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమి ఎల్ఎఫ్‌టీ ట్యాంక్ లెవెల్‌కు, బఫర్ జోన్లకు సరిహద్దులను ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములకు రక్షణగా హద్దులను ఏర్పాటు చేస్తూ ఫెన్సింగ్ నిర్మాణం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆకాష్ మండల్, బి అరుణ్, ఏ రవీందర్, యోగేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఓటర్ జాబితాను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్‌లో నిర్వహిస్తున్న ఓటరు జాబితా సమగ్ర సర్వేను కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం పరిశీలించారు. సర్వే అలస్యంగా కొనసాగుతుండడంతో బీఎల్వోలను మందలించి నిర్లక్ష్యం చేయకుండా వేగంగా గడువులోపు పగడ్బంధీగా పూర్తి చేయాలని, సర్వేపై పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం దేవాపూర్ గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న గ్యాస్ సబ్సిడీ ప్రొసిడింగ్ కాపీ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా ప్రజలతో మాట్లాడి వాటి వివరాలను వెల్లడించారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా సబ్సిడీ మంజూరు పత్రాలను లబ్దిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, కార్యదర్శి కవిత, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గణేష్ మండపంలో కుంకుమార్చన

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలోని సాయిరాం యూత్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణేష్ మండపంలో శనివారం ఘనంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యంలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా అర్చకులు తిరునగరి కన్నయ్య చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉన్నదని ఆయన తెలిపారు. నాటి తరం నుండి నేటి తరం వరకు బాధ్యతాయుతంగా సాయిరాం యూత్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు గణపతి నవరాత్రులు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాయిరాం యూత్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు, రావి చెట్టువాడకు చెందిన వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామస్తులు ఐక్యంగా ఉండాలి

నవతెలంగాణ-తాండూర్

గ్రామస్తులంతా ఐక్యమత్యంతో ఉండాలని తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ సూచించారు. శుక్రవారం రాత్రి తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. గ్రామంలో అందరూ ఒక చోట కూర్చొని అభివృద్ధిపై చర్చించాలని తెలిపారు. స్థానిక సమస్యలను, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. యువత చెడు అలవాటులకు దూరంగా ఉండాలని తెలిపారు. మంచిగా చదువుకొని ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గుట్కా గంజాయి మత్తు పదార్థలకు దూరంగా ఉండాలన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని లఖంపూర్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో పాఠశాలలోని 8, 9,10వ తరగతి విద్యార్థులకు, హెచ్‌బి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కృష్ణవేణి, జి.దినేష్, ఫార్మసిస్ట్ కిషన్ కుమార్, ఏఎన్ఎం ఆయేషా, శవంత, ల్యాబ్ టెక్నీషియన్ నవీన్, పాఠశాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఎం.అశోక్‌రావు, ఉపాధ్యాయుడు మెడికల్ ఇన్‌చార్జ్ ఉత్తంరావు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలు

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం తెలంగాణ రాష్ట్ర జూనియర్స్ బాలబాలికల బేస్‌బాల్ టోర్నమెంట్ ఛాంపియన్ షిప్ నిర్వహించారు. మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్, డీఎస్పీ గంగారెడ్డిలు ముఖ్యఅతిథిలుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీలను మన నిర్మల్ జిల్లా కేంద్రంలో జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రతీ క్రీడాకారులు పట్టుదలతో, సమిష్టిగా కృషి చేసి విజయం సాధించాలని తెలిపారు. త్వరలో ఛత్తీస్‌ఘడ్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో విజయడంకా మోగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్, సెక్రటరీ గంగాధర్, బేస్‌బాల్ రాష్ట్ర అసోసియేషన్ సెక్రటరీ శ్వేత, ట్రెజరర్ కృష్ణ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్, పేట సెక్రటరీ భోజన్న, సాఫ్ట్‌బాల్ సెక్రటరీ అన్నపూర్ణ, టోర్నమెంట్ అబ్జర్వర్ సునీల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-తాంసి

పీఆర్టీయూ భీంపూర్ మండలశాఖ నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో శనివారం పీఆర్టీయూటీఎస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులుగా గంపల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా ఉష్కం తిరుపతి, భీంపూర్ మండలశాఖ నూతన కార్యవర్గానికి పీఆర్టీయూ ఆదిలాబాద్ జిల్లాశాఖ పక్షాన శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికులకు మౌళిక వసతులు కల్పించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికులకు గనులలో మౌలిక వసతులు కల్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ సెక్రటరీ ఎస్కే బాజీ సైదా అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 గనిని సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యం కార్మికులకు వసతి సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతుందని, వేలకోట్ల లాభాల్లో ఉంటున్న సింగరేణి యాజమాన్యం కార్మికులకు కనీసం రెస్ట్ షెల్టర్లు, రూమ్స్, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించలేక పోతుందన్నారు. కార్మికులు పనిచేసే ప్రదేశాలలో పనిముట్లు అందుబాటులో ఉంచడం లేదని వెంటనే పని స్థలాల్లో పనిముట్లు, తాగునీరు వసతి కల్పించాలన్నారు. అనంతరం కార్మికులు తెలిపిన సమస్యల గురించి గని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ



కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫీట్ కార్యదర్శి గునిగంటి నరససింగారావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, సహాయ కార్యదర్శి లక్కిరెడ్డి, సత్తిరెడ్డి, నాయకులు భోగ మధునయ్య, జీపీ రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వందే భారత్ ట్రైన్‌కు మంచిర్యాల్‌లో హాల్టింగ్ ఇవ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



నవతెలంగాణ-మంచిర్యాల

వందే భారత్ రైలు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కోరారు. శనివారం మంచిర్యాల రైల్వే స్టేషన్ మేనేజర్ రవీందర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా మంచిర్యాల పారిశ్రామిక ప్రాంతమని, ప్రజలు, అధికారుల సౌకర్యార్థం వందే భారత్ ట్రైన్‌కు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. వడ్డించే వాడిదే ఆకలి అన్నట్టు బీజేపీ నాయకులు ప్రజల్ని నమ్మబలికించె ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. మంచిర్యాలను ఆనుకొని ఉన్న సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్, సింగరేణి సంస్థ ప్రజలు, ఉద్యోగులు, అధికారులు వివిధ ప్రాంతాలకు సునయాసంగా పోయేందుకు ఈ ట్రైన్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఖలిందర్ ఆలీ ఖాన్, జోగుల మల్లయ్య, మిట్టపల్లి శ్రీనివాస్ సీపీఐ జిల్లా సమితి సభ్యుడు మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, కుంచాల శంకరయ్య, కోడి వెంకటేశం, నాయకులు రాయమల్లు, ప్రభాకర్ పాల్గొన్నారు.

గురుకులంలో సంచార గ్రంథాలయం

నవతెలంగాణ-లక్సెట్టిపేట

అన్ని అంశాలకు ప్రభుత్వం మీద ఆధారపడకుండా గురుకుల పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలకు సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో లక్సెట్టిపేట సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు ముందుకు వచ్చారు. రెండవ శనివారం సందర్భంగా పాఠశాలకు తల్లిదండ్రులందరూ తమ పిల్లలను కలిసేందుకు పేరెంట్స్ స్వచ్ఛందంగా సంచార గ్రంథాలయాన్ని కళాశాలకు రప్పించి, తల్లిదండ్రులను విద్యార్థులను ప్రోత్సహించి, కొన్ని వందల పుస్తకాలను కొనుగోలు చేయించి, వాటన్నింటిని పాఠశాల లైబ్రరీకి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కె.రమా కల్యాణి మాట్లాడుతూ పుస్తకాలే విజ్ఞాన భాండాగారాలని, నేటి సోషల్ మీడియాయుగంలో పుస్తక పఠనం పట్ల ఆసక్తి తగ్గిపోయిందనీ, గురుకుల పాఠశాల విద్యార్థినులలో పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించాలన్న సదుద్దేశంతో, తమ ఉపాధ్యాయ వర్గం, తమ పాఠశాల పేరెంట్స్ సహకారముతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.



తల్లిదండ్రులే కాకుండా పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయినులు కూడా సంచార గ్రంథాలయంలో పుస్తకాలు కొనుగోలు చేసి, వాటిని పాఠశాల లైబ్రరీకి అందజేస్తున్నారని చెప్పారు. ఇట్టి వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టించిన గురుకుల పాఠశాల పేరెంట్స్ విజయ్-సరిత దంపతులను కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.మహేశ్వర రావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్, కమిటీ సభ్యులు, మాణిక్యం, మురళి, వీరస్వామి, సుజాతలు అభినందించారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని రాంసింగ్ రాజ్ పురోహిత్ ఇంట్లో ఈ నెల 8న చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తాళం వేసి ఉన్న రాంసింగ్ ఇంట్లోకి చొరబడిన నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన శంకర్‌రాం దేవసి మూడు తులాల మంగళసూత్రం, ఒక తులం బంగారు చైన్, వెండి ఆభరణాలు దొంగిలించాడు. శుక్రవారం రాత్రి నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. జన్నారంలో దొంగిలించిన సొత్తుతో పాటు, గతంలో లక్సెట్టిపేట మండలం తిమ్మాపూర్‌లో అపహరించిన మూడు తులాల బంగారు ముద్దను స్వాధీనం చేసు కున్నారు. బజార్‌హత్నూర్,



ఇచ్చోడలోనూ శంకర్‌రాం దేవసి దొంగతనాలకు పాల్పడినట్లు చెప్పారు. కార్యక్రమంలో జన్నారం ఎస్ఐ రాజ వర్ధన్, ఐడీ పార్టీ పోలీసులు తుకారాం, భాస్కర్ ఉన్నారు.

నిర్మాణ రంగంలో ఇంజనీర్లది కీలక పాత్ర

- ఏఈఈ గణేష్

నవతెలంగాణ-లక్సెట్టిపేట

నిర్మాణ రంగంలో ఇంజనీర్ల పాత్ర కీలకమైనదని లక్సెటిపేట ఏఈఈ గణేష్ అన్నారు. ఆనకట్టలు, రహదారులు, వంతెనలు నిర్మించి దేశ ప్రగతికి తోడ్పాటు అందించే వృత్తి ఇంజనీర్లదని ఇంజనీరింగ్ డే సంధర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. దేశ మొట్టమొదటి సివిల్ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిగా ఇంజనీర్లు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నో ఆనకట్టలకు కూలీలతోపాటు ఇంజనీర్ల కృషి ఫలితంగానే ఆహార సంక్షోభాన్ని అధిగమించామని అన్నారు. ముఖ్యంగా



సివిల్ ఇంజనీర్లు లేకపోతే మనదేశంలో ఈ స్థాయి అభివృద్ధి జరిగేది కాదని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలను పెంచేలా ఇంజనీర్లు పనిచేయాలన్నారు. ఒకప్పుడు 20 ఏళ్ల పాటు భద్రంగా ఉండే సీసీ రోడ్లు, ఇప్పుడు చిన్నపాటి వర్షానికే దెబ్బ తినటం సరికాదని అన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలని చెప్పారు. వర్షాలు వరదల నేపథ్యంలో దెబ్బతిన్న రహదారులను మెరుగుపరిచే విషయంలో ఇంజనీర్లంతా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని కోరారు. వృత్తికి వన్నె తెచ్చేవారినే చరిత్ర గుర్తుపెట్టుకుంటుందని, అందుకే సుప్రసిద్ధ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని ఇంజనీర్స్ డేగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు మృతి

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన నర్మెట సందీప్ (22) ఆగస్టు 19న ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు భీమారం హెడ్ కానిస్టేబుల్ మాచర్ల తెలిపారు. తల్లి అనారోగ్యంతో బాధపడుతుండటం తట్టుకోలేక జీవితంపై విరక్తి చెందిన సందీప్ మద్యం మత్తులో గురువుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుని తండ్రి నర్మెట సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీసీ రాష్ట్ర కార్యదర్శిగా అక్కల రమేష్



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణానికి చెందిన అక్కల రమేష్‌ను బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, గుమ్మల శ్రీనివాస్ శనివారం నియామక పత్రం అందించారు. సందర్భంగా గుమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ నిర్మాణంలో భాగంగా ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. బీసీలంతా సంఘటితంగా ఉద్యమాలు చేసి డిమాండ్ల సాధనే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. నూతనంగా ఎన్నికైన అక్కల రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం కల్పించిన జిల్లా కార్యవర్గానికి రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాబోయే రోజుల్లో రిజర్వేషన్లు సాధన లక్ష్యంగా పనిచేస్తానని తెలియజేశారు. హక్కుల సాధనే లక్ష్యంగా పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో గగ్గూరి సత్తయ్య, రాజన్న పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల్లో నీరు నిలువ ఉండకుండా చూడాలి

నవతెలంగాణ-జన్నారం



ఇంటి చుట్టూ మురికి నీరు నిల్వకుండా చూసుకోవాలని తిమ్మాపూర్ గ్రామ కార్యదర్శి మేక లావణ్య, హెల్త్ సూపర్‌వైజర్ కొల్లూరి కమలాకర్ సూచించారు. శనివారం తిమ్మాపూర్ గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులకు పలు సూచనలు సలహాలు అందించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి నీటిపై ఈగలు, దోమల వాలి డెంగ్యూ, మలేరియా వ్యాధుల వస్తాయన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. ఏఎన్ఎం మాధవి, అంగన్‌వాడీ టీచర్లు జాడి సంజీవరాణి, గంజాయిల జమున ఆశా కార్యకర్త రజిత ఉన్నారు.

జైనూర్ ఘటన బాదితురాలికి పరామర్శ

నవతెలంగాణ-జన్నారం

హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న జైనూర్ ఘటన బాధితురాలని శనివారం జీసీసీ చైర్మన్ కొట్నక్ తిరుపతి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత మహిళకు మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చేయాలని వైద్యులను కోరారు. సర్జరీ కావడంతో ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యులు తెలిపారు. నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని ఆర్థిక సాయం అందజేశారు.

కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం

నవతెలంగాణ-నస్పూర్

కౌశిక్ రెడ్డి హైదరాబాదులో శుక్రవారం చేసిన వాక్యాలు అర్థరహితమైనవని, మతి స్థిమితం లేకుండా మాట్లాడుతున్నాడని టీడీపీ పెద్దపల్లి ప్రధాన కార్యదర్శి తలారి రాజు, నస్పూర్ పట్టణ టీడీపీ నాయకుడు గరిగంటి రాజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. చొక్కాలు మార్చినట్టుగా పార్టీలు మారుస్తూ బీఆర్ఎస్‌లో చేరిన కౌశిక్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్రాప్‌లో పడి అతని డైరెక్షన్‌లో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నాడని అనడం హాస్యాస్పదమన్నారు. చంద్రబాబు నాయుడుపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సీఎస్ఆర్ నిధులతో వరద సాయం అందించాలి

నవతెలంగాణ-నస్పూర్

ఇటీవల కురిసిన భారీ వర్షాల్లో నష్టపోయిన వరద బాధితులకు సింగరేణి యాజమాన్యం సీఎస్ఆర్ నిధుల నుంచి వరద సాయం అందించాలని హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి అనిల్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన ప్రజానీకానికి సింగరేణి యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా హిందీ దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని మామిడిగూడ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ కాంప్లెక్స్‌లో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్ని హిందీ భాష ప్రధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రోడ్డ శైలజ మాట్లాడారు. గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. సక్రమంగా డ్యూటీలు చేయాలన్నారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని, రికార్డుల నిర్వహణ సక్రమం ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌సీఆర్‌పీ ఆత్రం మధుసుధన్, శంకర్, ఉపాధ్యాయులు ఆత్రం ఇస్తారి, గేడం బాలకిషన్, రాథోడ్ సీతారామ్, జాదవ్ రాంజీ, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్వరంతో మహిళ మృతి

నవతెలంగాణ-తలమడుగు

జ్వరంతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని భరంపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ఆసంపెల్లి సంతోష్ కవిత దంపతుల పెద్ద కుమార్తె హారిక(19)ను భరంపూర్ గ్రామానికి చెందిన నరోత్తమ్‌రెడ్డితో గత ఆరు నెలల కింద వివాహం జరిగింది. కాగా గత మూడు రోజుల నుంచి జ్వరం రావడంతో తల్లిదండ్రులు ప్రయివేటు ఆస్పత్రిలో వైద్యం చేయించినట్టు తెలిసింది. శుక్రవారం రాత్రి ఒకేసారి అధిక జ్వరంతో పాటు మూర్ఛవ్యాధి రాగా కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో రిమ్స్‌కు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించినట్టు తెలిపారు. హారిక మృతి పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రుల రోధన అందరిని కంటతడి పెట్టించింది.